








వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్త గృహసముదాయాలను ప్రారంభిస్తున్న సీఎం

# నివాసాలకు పచ్చజెండా

## రూ.172 కోట్లతో నిర్మించిన 1520 క్వార్టర్లు, ప్లాట్లు ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.172.72 కోట్లతో నిర్మించిన 1520 రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ను, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రూ.108.62 కోటతో నిర్మించిన పలు అంతస్థుల భవన సముదాయాలను, ప్రభుత్వ సిబ్బంది క్వార్టర్స్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో శనివారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించారు. మదురై జిల్లా మంజల్‌మేడు వద్ద 320 గృహసముదాయాలు, పుదుకోట జిల్లా పొన్నమరావతి వద్ద 264 ఇళ్లు, అరంతాంగి వద్ద 120 ఇళ్లు, తేని జిల్లా మీనాక్షిపురం వద్ద 240 భవన సముదాయాలు, తంజావూరు జిల్లా మహారాజముత్తిరం వద్ద 96 గృహ సముదాయాలను సీఎం ప్రారంభించారు. ఇదే విధంగా చెన్నై జిల్లా జాఫర్‌ఖాన్‌పేటలో రెవెన్యూ కార్యాలయ సముదాయం, మదురై తల్లాకులం వద్ద 224 ప్లాట్లతో గృహ సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, గృహ వసతి నగరాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు పూచ్చి ఎస్.మురుగన్, మేనేజింగ్ డైరెక్టర్ శరవణవేల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**నగరపాలక శాఖలో 21 పథకాల ప్రారంభం...**

ఇదే విధంగా సచివాలయంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో నగర పాలక శాఖ, తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో రూ.330.42 కోట్లతో పూర్తయిన 21 పథకాలను సీఎం ప్రారంభించారు. అదే విధంగా ఆ రెండు శాఖల ఆధ్వర్యంలో కొత్తగా చేపట్టనున్న 8 పథకాలకు శంకుస్థాపన చేశారు. మంత్రి కేఎన్ నెహ్రూ, జీసీసీ మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సాత్తూరులో టూరిస్టు బంగళా...**

ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో విరుదునగర్ జిల్లా సాత్తూరు వద్ద రూ.2.63 లక్షలతో రెండంతస్థులతో నిర్మించిన టూరిస్టు బంగళానూ సీఎం ప్రారంభించారు. ఇదే విధంగా తేని జిల్లా తేని జిల్లా కలెక్టరేట్ సమీపంలో రూ.2.37 కోట్లతో నిర్మించిన టూరిస్టు బంగళాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఈవీ వేలు, ప్రజాపనుల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చంద్రమోహన్, ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ కేపీ సత్యమూర్తి పాల్గొన్నారు.

**వంద పుస్తకాల ఆవిష్కరణ**

ప్యారీస్: స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి శత జయంతి వేడుకల్లో భాగంగా కలైంజర్ తమిళ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన 100 పుస్తకాలను సీఎం స్టాలిన్ ఆవిష్కరించారు. 2022 జనవరిలో ప్రారంభమైన కలైంజర్ తమిళ పరిశోధన సంస్థలో 100 మంది తమిళ రచయితలను సభ్యులుగా ఎంపిక చేశారు. 2023 అక్టోబరు 1వ తేది ముంబైలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఈ తమిళ రచయితలు పాల్గొన్నారు. అందులో భాగంగా కరుణానిధి జీవితచరిత్రతో 100 పుస్తకాలు తయారీ పనులను రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పర్యవేక్షణలో పూర్తి చేశారు. తిరువయ్యారు తమిళ్ అయ్యా ప్రచురణ సంస్థ ముద్రించిన ఈ పుస్తకాల్లో 62 మంది మహిళా రచయితలు కావడం గమనార్హం. ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ప్రముఖ రచయితలు అరుళ్‌ప్రకాశం, ఎంఎం తదితరులు పాల్గొన్నారు.

# మదురై చిన్నపిళ్లైకి ప్రభుత్వ నివాస గృహం

**● సీఎం స్టాలిన్ ఉత్తర్వు**



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మదురైకి చెందిన సంఘసేవకురాలు చిన్నపిళ్లైకి ప్రభుత్వ నివాస గృహాన్ని నిర్మించి ఇవ్వనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. చిన్నపిళ్లై సమాజానికి చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆమెను 'స్త్రీశక్తి' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కేంద్రప్రభుత్వం ఆమె సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజులకు ముందు చిన్నపిళ్లై విలేకరులతో మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద తనకు ఇంటిని కేటాయించనున్నట్లు హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు అది నెరవేరలేదని పేర్కొన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దృష్టికి వచ్చింది. చిన్నపిళ్లైకి ఇదివరకే కేటాయించిన సెంట్ విస్తీర్ణం కలిగిన ఇంటి జాగాతోపాటు విల్లుపురం సమీపం తిరువిళా పట్టిలో 380 చదరపు అడుగు విస్తీర్ణం కలిగిన పట్టాభూమిని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆ స్థలంలో కలైంజర్ డ్రీమ్ హౌస్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వమే ఆమెకు ఇంటిని నిర్మించి ఇవ్వనున్నదని స్టాలిన్ ప్రకటించారు. ఆ ఇంటి నిర్మాణ పనులు కూడా ఈ నెలలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నపిళ్లై ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

సీట్ల సర్దుబాట్ల ఒప్పంద పత్రాలను చూపుతున్న మక్కల్ నీదిమయ్యం నేత కమల్‌హాసన్, డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



# డీఎంకే కూటమిలో కమల్‌కు రాజ్యసభ సీటే

**లోక్‌సభ ఎన్నికలకు దూరం ● ప్రచారానికే ఉలగ నాయకుడు పరిమితం**

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రముఖ సినీ నటుడు కమలహాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం పార్టీ డీఎంకే కూటమిలో స్థానం మాత్రమే సంపాదించుకుంది. ఒక్క సీటును కూడా సంపాదించుకోలేకపోయింది. ఆ మేరకు శనివారం మధ్యాహ్నం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ సమక్షంలో కమల్ ఒప్పందం కుదుర్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సీటివ్వని డీఎంకే వచ్చే యేడాది జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో కమల్ పార్టీకి సీటును కేటాయించేందుకు అంగీకరించింది. ఈ ప్రతిపాదన ప్రకారమే రెండు పార్టీల నడుమ ఒప్పందం కుదిరింది. ఈ ఎన్నికల ఒప్పందం కుదుర్చుకునేందుకు శనివారం మధ్యాహ్నం అరివాలయానికి వెళ్లిన కమల్‌కు మంత్రి ఉదయనిధి స్వాగతం పలికారు. అటుపిమ్మట పావుగంట సేపు స్టాలిన్‌తో ఆయన చర్చించారు. చివరగా వచ్చే యేడాది జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో సీటును కేటాయించేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ తర్వాత డీఎంకే సీనియర్ నేతల నడుమ ఇరువురూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

**ప్రచారం మాత్రమే...**

డీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న తర్వాత కమల్ అరివాలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయనని, తన పార్టీ తరఫున కూడా ఎవరూ నిలబడరని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. ప్రస్తుతం రెండు పార్టీల మధ్య ఏర్పడిన ఒప్పందం పదవుల కోసం కుదుర్చుకున్న ఒప్పందంగా భావించకూడదని, దేశ సంక్షేమం దృష్ట్యా ఏర్పరచుకున్నదిగా పరిగణించాలన్నారు. దేశ ప్రగతి కోసం ఎవరితో కరచాలనం చేయాలో ఆయనతోనే చేశానని కమల్ చెప్పారు.

# కాంగ్రెస్‌కు పది సీట్ల కేటాయింపు

**స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం**



స్టాలిన్, సెల్వపెరుందగై తదితరులు

ప్యారీస్, మార్చి 9: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు పది సీట్లు దక్కింది. పుదుచ్చేరి నియోజకవర్గంతోపాటూ రాష్ట్రంలోని తొమ్మిది స్థానాల్లో ఆ పార్టీ పోటీకి దిగనుంది. ఈ మేరకు శనివారం సాయంత్రం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో రెండు పార్టీల నేతలు సమావేశమై డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఒప్పంద పత్రాలపూ సంతకాలు చేశారు. డీఎంకే ఎన్నికల సీట్ల సర్దుబాట్ల కమిటీ ఛైర్మన్ ఎంపీ టీఆర్ బాలు, సీనియర్ మంత్రి దురైమురుగన్, ఎంపీ తిరుచ్చి శివా తదితరులతో ఢిల్లీ నుంచి విచ్చేసిన ఏఐసీసీ ప్రధానకార్యదర్శులు కేసీ వేణుగోపాలు, ముకుల్ వాస్నిక్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్, సెల్వపెరుంతగై సహా కాంగ్రెస్ ముఖ్య నేతలు చర్చల్లో పాల్గొన్నారు. సీట్ల ఖరారైన తర్వాత కాంగ్రెస్ నేతలు మీడియాతో మాట్లాడుతూ... గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో లాగే 2024 ఎన్నికల్లో కూడా తమ పార్టీకి డీఎంకే అధిష్ఠానం పుదుచ్చేరి సహా పది స్థానాలు కేటాయించిందన్నారు. ఈ స్థానాలతోపాటు డీఎంకే మిత్రపక్షాలు పోటీ చేస్తున్న స్థానాల్లో కూటమి అభ్యర్థులంతా ఘనవిజయం సాధించేలా విస్తృత ప్రచారం సాగించనున్నట్లు ప్రకటించారు.

**ఎవరికి ఎన్ని సీట్లు...**

డీఎంకే కూటమిలో కాంగ్రెస్ సహా మిత్ర పక్షాల సీట్ల కేటాయింపుల ప్రక్రియ శనివారం రాత్రి పూర్తయ్యాయి. ఈ కూటమిలో సీపీఐకి 2, సీపీఎంకు 2, డీపీఐకి 2, ఐయూఎంఎల్‌కు 1, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చికి 1, ఎండీఎంకేకి 1 సీటు చొప్పున కేటాయించారు. ఈ సీట్లు పోగా డీఎంకే ఈ ఎన్నికల్లో 22 నియోజకవర్గాలలో ఉదయించే సూర్యుడి గుర్తుపై పోటీ చేయనుంది. అలాగే కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేటాయించిన పది సీట్లలో తేని నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తనయుడు రవీంద్రనాథ్ గెలిచారు. మిగతా తొమ్మిది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం తేని నియోజకవర్గంలో డీఎంకే పోటీ చేయనుంది. ఇదే విధంగా గత ఎన్నికల్లో పెరంబలూరు నియోజకవర్గంలో గెలిచిన ఐజేకే... డీఎంకే కూటమి నుండి వైదొలగిన కారణంగా ఆ స్థానంలో డీఎంకే పోటీ చేయడం స్పష్టమైంది. ఎన్నికల నోటిఫికేషన్ మరో రెండు మూడు రోజులలో జారీ కానున్న నేపథ్యంలో ఎన్నికల బరిలో ఈ సారి ప్రధానపోటీ డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, బీజేపీ కూటమి, నామ్ తమిళర్ కట్చి మధ్యే జరగనుంది.

# వీసీకే ప్రధాన కార్యదర్శి నివాసం సహా 10 చోట్ల ఈడీ తనిఖీలు

అడయార్, మార్చి 9: రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల్లో ఒకటిగా ఉన్న విడుదలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే) ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునన్, కాంట్రాక్టరు నివాసం, కార్యాలయంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పది చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం ఆకస్మికంగా సోదాలు చేశారు. మనీలాండరింగ్‌తో పాటు పన్ను ఎగవేతకు సంబంధించి ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు చేపట్టింది. గత కొన్ని రోజులుగా ఈడీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వరుస తనిఖీలు చేపడుతున్న విషయం తెల్సిందే. రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఆడిటర్ల నివాసాల్లో ఈ సోదాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మరోమారు ఈడీ అధికారులు అర్జునన్ నివాసం, కార్యాలయంతో పాటు, కాంట్రాక్టర్ సెల్వరాజ్ ఆఫీసు, గృహాల్లో సోదాలు చేశారు. ఆర్ఏపురంలోని సెల్వరాజ్ నివాసం, అభిరామిపురంలో ఉన్న ఆయన కార్యాలయం, తేనాంపేటలోని ఇల్లు, ప్యారీస్‌లో ఉన్న ఇంపాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ కార్యాలయాల్లో ఈ తనిఖీలు చేశారు. అలాగే, వెప్పేరిలోని ఈవీకే సంపత్ రోడ్డు, ప్రిన్స్ టవర్స్ 11వ అంతస్తులో ఉన్న నివాసంలో కూడా ఈ సోదాలు జరిగాయి. అదేవిధంగా తేనాంపేట, కస్తూరిరంగన్ రోడ్డులో ఉన్న వీసీకే ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునన్ నివాసంతో పాటు అదే రోడ్డులో ఉన్న ఆయన మైక్రో ఫైనాన్స్ కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. ఈయన దాదాపు 10కి పైగా కంపెనీలు నడుపుతున్నట్టు సోదాల్లో తేలింది. ఇకపోతే, కోయంబత్తూరులోని రామనాథపురానికి చెందిన కృష్ణస్వామి అనే వ్యక్తికి చెందిన కారు షోరూంలో కూడా ఈడీ తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో అత్యంత కీలమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. దాదాపు 15 మందికిపైగా ఈడీ అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొనగా, సోదాలు జరిగిన కార్యాలయాలు, గృహాల వద్ద కేంద్ర బలగాలైన సీఐఎస్ఎఫ్ పోలీసులను మొహరించారు.

# 15 గంటల్లో 20 లక్షల మందికి తమిళగ వెట్రిక్కళగంలో సభ్యత్వం



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రిక్కళగంలో సభ్యులుగా చేరేందుకు రాష్ట్రంలోని యువకులు పోటీ పడ్డారు. శుక్రవారం సాయంత్రం సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విజయ్ తొలి సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక యాప్ ద్వారా, ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ ఏర్పాట్లను పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పర్యవేక్షించారు. సభ్యత్వ నమోదు ప్రారంభమైన 15 గంటలలోపే 20లక్షల మందికి పైగా సభ్యులుగా పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆనంద్ అధికారికంగా ప్రకటించారు. సభ్యత్వం పొందినవారిలో యాభైశాతానికి పైగా యువతీయువకులే ఉన్నారని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా సభ్యత్వ నమోదు కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ శనివారం మధ్యాహ్నం నుంచి మొరాయించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ యాప్‌ను పునరుద్ధరించేందుకు పార్టీ నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు.

# రాజ్యసభ సీటు కోసం ప్రేమలత పట్టు

**● కొలిక్కిరాని చర్చలు**



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది రాష్ట్రంలో ఖాళీ పడనున్న రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో తమ పార్టీకి ఒక సీటు కేటాయించాలని డీఎండీకే నాయకురాలు ప్రేమలత పట్టుబడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల సర్దుబాట్ల ప్రతిష్టంభన కొనసాగుతోంది. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే చేరినా రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు సాఫీగా జరగలేదు. తొలుత ఈ నెల 1న అన్నాడీఎంకే నేతలు విరుగంబాక్కంలోని ప్రేమలత ఇంటికి వెళ్లి ఆమెతో చర్చలు జరిపారు. ఆ తర్వాత అన్నాడీఎంకే కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో డీఎండీకే సభ్యులు రెండో విడత చర్చలు జరిపారు. ఆ సందర్భంగా డీఎండీకే నేతలు విలేకరులతో మాట్లాడుతూ.... గెలుపు కూటమిలో చేరటం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఆ తర్వాత మూడో విడత చర్చలు జరిపి డీఎండీకేకి సీట్ల కేటాయింపులు ఖరారవుతాయని రెండు పార్టీల నేతలు ఎదురుచూశారు. శుక్రవారం నగరంలో విశ్లేరుల సమావేశంలో ప్రేమలత మాట్లాడుతూ కూటమిపై తమ పార్టీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదంటూ ప్రకటించారు. దీంతో అన్నాడీఎంకే నేతలంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు విడతలుగా చర్చలు జరిపిన తర్వాత కూడా కూటమిపై నిర్ణయం తీసుకోలేదని ప్రకటించడం వెనుక తిరకాసు ఏమిటో తెలియక అన్నాడీఎంకే నేతలు సతమతమయ్యారు.

**● మహిళా ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసు**

# మాజీ డీజీపీ రాజేష్‌దాస్ పరారీ



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పర్యటన సందర్భంగా భద్రతా విధుల్లో పాల్గొన్న మహిళా ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో జైలు శిక్ష పడిన మాజీ స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్ పరారయ్యారు. సీబీసీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడానికి వెళ్లినప్పుడు ఈ విషయం బయటపడింది. విల్లుపురం కోర్టు రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం విదితమే. ఈ శిక్షను సవాలు చేస్తూ ఆయన ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో సీబీసీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం పరారైన రాజేష్‌దాస్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

# సైనిక సేవలకు సిద్ధమైన 220 మంది అధికారులు

**● ఘనంగా పాసింగ్ అవుట్ పెరేడ్**

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 220 మంది సైనికాధికారులు సైనిక సేవలకు సిద్ధమయ్యారు. వీరిలో 36 మంది మహిళలు ఉన్నారు. శనివారం ఉదయం ఆ అకాడమీలోని పరమేశ్వరన్ డ్రిల్ స్క్వేర్‌లో పాసింగ్ అవుట్ పెరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైమానిక దళాధిపతి ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి గౌరవ వందనం స్వీకరించారు. ఓటీఏ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సంజీవ్ చౌహాన్ సమక్షంలో లెఫ్టినెంట్ శౌర్యన్ తాపాకు ఓటీఏ స్వర్ణ పతకాన్ని అందజేశారు. ఇదే విధంగా లెఫ్టినెంట్ ఆర్యన్ షాహీకి రజతం, లెఫ్టినెంట్ శరణ్యకు కాంస్య పతకాన్ని అందించారు. ఈ వేడుకకు హాజరైన కొత్త ఆఫీసర్ల కుటుంబీకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



తాంబరంలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ మైదానంలో పాసింగ్ అవుట్ పెరేడ్‌ను పరిశీలిస్తున్న ఆర్మీ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి - ఓటీఏ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సంజీవ్ చౌహాన్ సమక్షంలో లెఫ్టినెంట్ శౌర్యన్ తాపాకు స్వర్ణ పతకాన్ని అందజేస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ వీరో్ చౌదరి

# సమాచార దర్శిని

## నేటినుంచి నందనంలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 9: మెట్రో రైలు పనుల కారణంగా నందనం వీఎన్‌రోడ్డులో ఈనెల 10న ఆదివారం నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులు చేపట్టనున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. అన్నాసాలై నుంచి వెంకట నారాయణ రోడ్డు మీదుగా టి.నగర్ వెళ్లే వాహనాలు మోడల్ హౌస్ రోడ్డు జంక్షన్, బోగ్ రోడ్డు మీదుగా వెళ్లాలి. బర్కిట్ రోడ్డు, టి.నగర్ నుంచి ముప్పారప్పన్ వీధి మీదుగా వచ్చే వాహనాలు బోగ్ రోడ్డు జంక్షన్‌లో కుడివైపు తిరిగి అన్నాసాలై చేరుకోవాలి. బోగ్ రోడ్డు, దక్షిణ దండపాణి వీధి నుంచి వచ్చే వాహనాలు సీఐటీ నగర్ నాలుగవ మెయిన్ రోడ్డు, సీఐటీ నగర్ 3వ మెయిన్ రోడ్డు మీదుగా అన్నాసాలై చేరుకోవాలి.

## అనువాద పుస్తకాల ఆవిష్కరణ

ఐసిఎఫ్, మార్చి 9: ఎస్సీ, ఎస్టీ రచయితల ఆంగ్ల అనువాద పుస్తకాలను మంత్రి కయల్‌విళి ఆవిష్కరించారు. చెన్నై ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 11 మంది ఉత్తమ రచయితలను ఎంపిక చేశారు. వారు రచించిన పుస్తకాలను ఆవిష్కరించగా, తొలివిడత ఆర్థిక సాయంగా తలా రూ.50 వేల చెక్కులను మంత్రి అందజేశారు.

## పూండి, చోళవరం జలాల విడుదల

ఐసిఎఫ్,మార్చి9:స్థానిక పూండి, చోళవరం జలాశయాల నుంచి కాలువద్వారా నీటివిడుదలపెంచారు. తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న పుళల్, పూండి, చోళవరం, చెంబరంబాక్కం, తేర్వాయికండిగై జలాశయాలు చెన్నై నగర ప్రజల తాగునీటిఅవసరాలు తీరుస్తున్నాయి.వీటి మొత్తం సామర్థ్యం 11.7టీఎంసీలుకాగా, ప్రస్తుతం 8.76టీఎంసీల నీటినిల్వలున్నాయి.పూండిలో 2.30టీఎంసీలు, చోళవరంలో 0.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడ తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలులేకపోవడంతో కాలువలద్వారా పుళల్, చెంబరంబాక్కం జలాశయాలకు తరలిస్తున్నారు. ఎండల ప్రభావంతో నీరు ఆవిరైపోతోంది.కాలువ గట్లలో ఉన్న పగుళ్లకారణంగా నీరువృథా అవుతోంది.గట్ల పటిష్ట పనులు చేపట్టనుండడంతో పూండి జలాశయం నుంచి సెకనుకు 303ఘనపుటడుగులు, చోళవరం జలాశయం నుంచి 416 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. చోళవరం జలాలు పుళల్‌కు సెకనుకు 340 ఘనపుటడుగులు, పూండి జలాలు చెంబరంబాక్కానికి 220 ఘనపు టడుగులుగా వచ్చి చేరుతున్నాయి.

## 12న దివ్యాంగుల గ్రీవెన్స్

ఐసిఎఫ్, మార్చి 9: చెన్నై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేది దివ్యాంగుల గ్రీవెన్స్ జరగనుంది. దివ్యాంగులకు ఒక్కో జిల్లాలో రెండు నెలలకు ఒకసారి ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఆ ప్రకారం, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో దివ్యాంగులు పాల్గొని సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

## గ్రూప్-4 పోస్టులకు 20 లక్షలమంది దరఖాస్తు

పెరంబూర్, మార్చి 9: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 6,244 గ్రూప్-4 పోస్టుల భర్తీకి తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) జనవరి 30వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఫిబ్రవరి 28వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. దరఖాస్తు స్వీకరణ పొడిగింపుపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈ మేరకు 6,244 పోస్టులకు 20,37,094 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు 326 మంది పోటీపడుతున్నట్లు అయింది. ఈ పోస్టులకు భర్తీకి సంబంధించిన రాతపరీక్ష జూన్ 9వ తేది జరగనుంది. కాగా, 2022లో నిర్వహించిన 7,500 గ్రూప్-4 పోస్టులకు 22,02,942 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## ప్లస్ టూ పరీక్షలకు 5,144 మంది గైర్హాజరు

పెరంబూర్, మార్చి 9: ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 5,144 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 1వ తేది ప్రారంభమై 22వ తేది వరకు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో శుక్రవారం కంప్యూటర్ సైన్స్, బయోకెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్ సహా 11 పాఠ్యాంశాలకు పరీక్ష జరగ్గా, 5,144 మంది విద్యార్థులు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.

## సెంటినరీ లైబ్రరీ నుంచి పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లొచ్చు

పెరంబూర్, మార్చి 9: స్థానిక కోట్టూరుపురంలో ఉన్న అన్నా సెంటినరీ లైబ్రరీ నుంచి చదువుకొనేందుకు పుస్తకాలు బయటకు తీసుకెళ్లేందుకు అనుమతి లభించింది. ఆ ప్రకారం, లైబ్రరీలో సభ్యులుగా చేరిన వారు, పుస్తకాలు బయటకు తీసుకెళ్లవచ్చు. 30 రోజుల్లో తిరిగి పుస్తకాన్ని అప్పగించాలి. ఆ ప్రకారం, ఈ నెల 11వ తేది నుంచి సభ్యులు పుస్తకాలు బయటకు తీసుకెళ్లొచ్చు. ఈ లైబ్రరీలో సుమారు 6 లక్షల పుస్తకాలుండగా, బయటకే తీసుకెళ్లే పుస్తకాల జాబితాలో లక్ష పుస్తకాలున్నాయి.

## మెట్రోలో మహిళా ప్రయాణికులకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్

ఐసిఎఫ్,మార్చి9:చెన్నై మెట్రోరైలులో మహిళా ప్రయాణికుల భద్రతకు పింక్ స్క్వాడ్ పేరుతో ప్రత్యేక మహిళా భద్రతా సిబ్బందిని నియమించిన విషయం విదితమే. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీరి భద్రత మరింత పటిష్ఠపరిచేలా 155370 ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబరును పరిచయం చేశారు. ఈ నెంబరు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో మాత్ర మే పనిచేస్తుందని, ఇతర నెట్‌వర్కులతో అనుసంధాన పనులు చేపడుతున్నామని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

## పర్యాటక శాఖకు పురస్కారం

ఐసిఎఫ్, మార్చి 9: జర్మనీ అంతర్జాతీయ టూరిజం మార్కెట్లో జరిగిన పసిఫిక్ ప్రాంత ప్రయాణ రచయితల సంఘ పురస్కారాలు అందజేసే కార్యక్రమంలో 2024వ సంవత్సరం సంస్కృతి, పర్యటనకు సంబంధించి పట్వా అంతర్జాతీయ పురస్కారం రాష్ట్ర పర్యాటక శాఖకు అందజేశారు. బెర్లిన్ నగరంలో అంతర్జాతీయ పర్యాటక మార్కెట్ నిర్వహించగా, రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేశారు. తమిళనాడు పర్యాటక ముఖ్యాంశాల వీడియోను లఘుచిత్రంగా ప్రదర్శించారు. ఈ లఘుచిత్రం సందర్శకులను ఆకట్టుకుంది. దీన్ని ప్రశంసిస్తూ జమైకా దేశ పర్యాటక శాఖ మంత్రి రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి మణివాసన్‌కు పట్వా అంతర్జాతీయ ట్రావెల్ అవార్డు అందజేశారు.

## తిరువొత్తియూర్‌లో ఆర్‌యూబీ

ఐసిఎఫ్, మార్చి 9: స్థానిక తిరువొత్తియూర్‌లో రూ.25.09 కోట్లతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరువొత్తియూర్ వింకోనగర్ రైలు గేటును దాటి ప్రతిరోజు వేలసంఖ్యలో వాహనాలు వెళ్తున్నాయి. రైళ్లు వచ్చి వెళ్లేటప్పుడు గేటు వేయడంతో ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రహదారుల శాఖ రూ.25.09 కోట్లతో 342 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో సబ్‌వే నిర్మాణపనులు చేపట్టింది. 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 80,076 మంది చేరిక

పెరంబూర్, మార్చి 9: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధనలను ప్రభుత్వం మెరుగు పరిచింది. పాఠశాలల్లో అవసరమైన తరగతి గదులు, స్మార్ట్ క్లాస్ రూంలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, అధునాతన ల్యాబ్ తదితరాలు ఏర్పాటవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలు సహా 11 విద్యా ఉపకరణాలు ఉచితంగా అందజేస్తోంది. ఇక, ఉన్నత విద్యలో చేరే ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు నెలకు రూ.1,000 ప్రోత్సాహక వేతనం అందించడంతో పాటు, ఎంబీబీఎస్ అడ్మిషన్లలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది. దీంతో, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల అడ్మిషన్లు ఈ నెల 1వ తేది నుంచి చేపడుతున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈనెల 1 నుంచి శుక్రవారం వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 80,076 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, కళ్లకుర్చి జిల్లాల్లో అత్యధికంగా 10,411 మంది చేరారు. ప్రాథమిక పాఠశాలల్లో 4,959 మంది, మహోన్నత పాఠశాలల్లో 5,452 మంది చేరారు. సేలం జిల్లాలో 3,890, కృష్ణగిరి జిల్లాలో 7,770 మంది ప్రభుత్వ పాఠశాల్లో చేరారు. 1 నుంచి 5వ తరగతి ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 46,586 మంది, మాధ్యమిక పాఠశాలల్లో 21,853 మంది, ఉన్నత పాఠశాలల్లో 6,287 మంది, మహోన్నత పాఠశాలల్లో 5,350 మంది చేరినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# లోక్‌సభ ఎన్నికలతో పాటు ఉపఎన్నికలు

**తిరుకోవిలూర్‌కు ఈవీఎంల తరలింపు**

పెరంబూర్, మార్చి 9: తిరుకోవిలూర్ నియోజకవర్గ ఉపఎన్నిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విల్లుపురం కలెక్టర్ పళని నేతృత్వంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎల తరలింపు పనులు చేపట్టారు. కళ్లకుచ్చి జిల్లా తిరుకోవిలూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న పొన్ముడికి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో, ఆయన తన ఎమ్మెల్యే పదవి కోల్పోవడంతో, ఆ నియోజకవర్గం ఖాళీయైనట్లు శాసనసభ స్పీకర్ ఎన్నికల సంఘానికి లేఖ ద్వారా తెలియజేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక కూడా జరుగుతుందని ఈసీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో, విల్లుపురంలోని ప్రభుత్వ గోదాములోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను తిరుకోవిలూర్‌కు పంపే పనులు కలెక్టర్ పళని నేతృత్వంలో ప్రారంభమయ్యాయి. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయధరణి పార్టీకి సహా తన పదవికి రాజీనామా చేయడంతో విలవంగోడుకు ఉప ఎన్నిక జరగనుంది. ఈక్రమంలో విల్లుపురం నుంచి ఇప్పటికే ఈవీఎంలు తరలించారు.



ఈవీఎంల తరలింపు పరిశీలిస్తున్న కలెక్టర్ పళని

## రూ.1,675 కోట్లతో భూగర్భ డ్రైనేజీ

ఐసిఎఫ్, మార్చి 9: స్థానిక మనలి, మాధవరం, రాయపురం, షోళింగనల్లూర్ మండలాల్లో రూ.1,675 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పథకంలో భాగంగా రూ.163 కోట్లతో మురుగు తొలగించే వాహనాలు కొనుగోలు చేయనున్నారు. మే ఆఖరులోగా ఈ పనులు పూర్తికానున్నాయని చెన్నై కార్పొరేషన్ తెలిపింది.

## లాట్‌గా మద్యం విక్రయించొద్దు

ఐసిఎఫ్, మార్చి 9: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దుకాణాల్లో లాట్‌గా మద్యం సీసాలు విక్రయించరాదని టాస్మాక్ సంస్థ జిల్లా మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న సమయంలో దుకాణాల్లో 50 శాతానికి పైగా మద్యం రకాలు నిల్వ ఉండకుండా చూసుకోవాలి, మద్యం విక్రయాలు గత ఏడాది కన్నా 30 శాతం అధికంగా ఉంటే కమిషన్ విచారణ చేపడుతుంది. కాబట్టి 30 శాతం మించకుండా చూసుకోవాలి, మద్యం సీసాలను ఎక్కువ మొత్తంలో విక్రయించరాదు. ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వం అనుమతించిన మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే దుకాణాలను పనిచేయాలని టాస్మాక్ సంస్థ పేర్కొంది.

## మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి మనో తంగరాజ్

పెరంబూర్, మార్చి 9: మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మనో తంగరాజ్ స్పష్టం చేశారు. నాగర్‌కోయిల్ సమీపం పుత్తేరి పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణాలను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాల రహిత తమిళనాడును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చర్యలు చేపట్టారన్నారు. మాదకద్రవ్యాల తరలింపులో ఎవరి ప్రమేయమున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రతిపక్షాలను బెదిరించేలా బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థలను వినియోగిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్మును దోచుకుంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలపై ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని మంత్రి తెలిపారు.

## విల్లివాక్కం బస్టాండ్ తరలింపు



పెరంబూర్, మార్చి 9: నగరంలో చేపడుతున్న మెట్రోరైలు పనుల కారణంగా విల్లివాక్కం బస్టాండ్‌ను ఐసిఎఫ్ సమీపంలో తాత్కాలికంగా తరలిస్తున్నట్లు సమాచారం. మాధవరం - షోళింగనల్లూర్ మధ్య మెట్రోరైలు మార్గం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ మార్గంలో ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతంగా ఉన్న విల్లివాక్కం బస్టాండ్ ముందు భాగంలో మెట్రో రైల్వేస్టేషన్ ఏర్పాటుకానుంది. భూమి కింద భాగంలో 15 మీటర్ల లోతున సొరంగ రైల్వేస్టేషన్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో తొలివిడత పనులు ప్రారంభించగా, త్వరలో భారీ యంత్రాలు తరలించనున్నారు. దీంతో, ప్రయాణికుల ఇబ్బందులు పరిగణలోకి తీసుకొని తాత్కాలికంగా బస్టాండ్‌ను ఐసిఎఫ్‌కు తరలించాలని సీఎంఆర్ఎల్ అధికారులు నిర్ణయించారు. పనులు పూర్తయ్యేందుకు సుమారు 3 నెలలు పడుతుందని సమాచారం. ఇందుకు బస్టాండ్ తరలింపుకు అంగీకారం కోరుతూ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)కి సీఎంఆర్ఎల్ లేఖ రాసింది. ఆమోదం లభించిన వెంటనే విడతలవారీగా తాత్కాలిక బస్టాండ్ నుంచి బస్సులు నడపనున్నట్లు, నెం.22, 27, 47 బస్సులు మాత్రం విల్లివాక్కం బస్టాండు నుంచే నడిపేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

## సలాసలా కాగుతున్న నూనెలో చేతులతో బజ్జీలు కాల్చిన బామ్మ




కాగుతున్న నూనె నుంచి బజ్జీలు తీస్తున్న ముత్తమ్మాళ్

ప్యారీస్, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సలసలా కాగుతున్న నూనెలో ఓ బామ్మ చేతులు పెట్టి బజ్జీలు కాల్చి విస్మయపరిచింది. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ మొదటియార్‌పట్టి వీధిలో ఉన్న భద్రకాళి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వ్రతమాచరించిన వేలాదిమంది భక్తుల సమక్షంలో ముత్తమ్మాళ్ (92) ప్రతి సంవత్సరంలాగే అమ్మవారికి మొక్కులు చెల్లించుకొనేలా, సలసలా కాగుతున్న నూనెలో చేతులు పెట్టి బజ్జీలు తీసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించింది.

## మహిళలను లక్షాధికారులను చేస్తాం

● కేంద్ర మంత్రి మురుగన్



పెరంబూర్, మార్చి 9: దేశవ్యాప్తంగా మూడు కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు. కోయంబత్తూర్ వెళ్లేందుకు శనివారం ఉదయం బయల్దేరిన మురుగన్... నగరంలోని విమానాశ్రయంలో విలేఖరులతో మాట్లాడుతూ పదేళ్లలో తమ సోదరీమణులు, తల్లుల జీవనాధారం పెంచేలా ప్రధాని పలు పథకాలు అమలు చేశారన్నారు. వాటిలో ప్రముఖంగా, దేశవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది సొంత గృహాలు నిర్మించారని తెలిపారు. ఈ గృహాలకు సంబంధించిన పట్టాలు మహిళల పేరుతోనే ఉన్నాయన్నారు. అలాగే, ప్రతి ఇంట్లో ఉచితంగా మరుగుదొడ్డి ఏర్పాటుచేసే పనులు చేపట్టామన్నారు. కొత్త పార్లమెంటు భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే తీర్మానాన్ని మోదీ ప్రవేశపెట్టారన్నారు.

## ఏసీఎస్ ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ



సహాయాల పంపిణీలో అరుణ్‌కుమార్

వేలూరు, మార్చి 9: గుడియాత్తంలో శనివారం ఏసీఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీఎస్ విద్యా కమిటీ అధ్యక్షుడు ఏసీఎస్ అరుణ్‌కుమార్ పాల్గొని, ప్రజలకు సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎస్ వైద్యకళాశాల, ఆసుపత్రి సెక్రటరీ రవికుమార్, పుదియ నీతి పార్టీ జిల్లా నాయకులు ప్రేమాస్, ఆర్పీ సెంథిల్, రాజ్‌కుమార్, భరత్‌మహి తదితరులు పాల్గొన్నారు.

## డీఎంకేలో పోటీకి 2,984 మంది దరఖాస్తు

పెరంబూర్, మార్చి 9: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నుంచి పోటీ చేసేందుకు 2,984 మంది దరఖాస్తులు సమర్పించారు. పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయగోరు ఆశావాహులు ఈనెల 1 నుంచి దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తుతో పాటు రూ.50 వేలు చెల్లించాలని డీఎంకే ప్రధా కార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. ఆ ప్రకారం, దరఖాస్తు స్వీకరణ ఈనెల 8న శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనిమొళి మళ్లీ తూత్తుకుడి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు సమర్పించారు. ఈ నియోజకర్గంలో పోటీకి మరెవ్వరూ దరఖాస్తు చేసుకోలేదు. అలాగే, నీలగిరి నుంచి ఎ.రాజా, దక్షిణ చెన్నై నుంచి తమిళచ్చి తంగపాండ్యన్, ఉత్తరచెన్నై నుంచి కళానిధి వీరాస్వామి మళ్లీ పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించారు. ఇక, శ్రీపెరుం బుదూర్ నుంచి టీఆర్ బాలు, పడప్పై మనోహరన్ దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారీగా దరఖాస్తుల వివరాలు, వసూలైన నగదు వివరాలు త్వరలో తెలియజేస్తామని పార్టీ పేర్కొంది.

## 40 స్థానాల్లో పోటీ : సీమాన్

పెరంబూర్, మార్చి 9: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని నామ్ తమిళర్ పార్టీ చీఫ్ సీమాన్ తెలిపారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించామన్నారు. 'చెరకు రైతు' గుర్తు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించామని, తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని నమ్మకం ఉందన్నారు. 40 స్థానాల్లో తలా 20 మంది పురుషులు, మహిళలు పార్టీ తరఫున పోటీ చేస్తారని సీమాన్ తెలిపారు.

## సిలిండర్ ధర తగ్గింపు ఎన్నికల స్టంట్

● కనిమొళి

పెరంబూర్, మార్చి 9: ఎన్నికలు దగ్గరపడుతుండడంతో కేంద్రప్రభుత్వం సిలిండర్ ధర తగ్గించిందని డీఎంకే ఎంపీ కనిమొళి విమర్శించారు. తూత్తుకుడిలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... సిలిండర్ ధర ఎప్పుడో తగ్గించి ఉండొచ్చన్నారు. కానీ, ఎన్నికలు వస్తుండడంతో హడావుడిగా ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించారన్నారు. అది కూడా మహిళా దినోత్సవం రోజునే ప్రకటన వెలువడిందన్నారు. మహిళలకు సిలిండర్ ధర మాత్రమే ఆందోళన కలిగిస్తుందా? మహిళలు వంట గదుల్లోనే ఉండాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమా... ఇలాంటి కల్లబొల్లి తగ్గింపులతో ప్రజలను నమ్మించలేరని ఎంపీ కనిమొళి పేర్కొన్నారు.

## చిన్నారుల కిడ్నాప్ జరగలేదు

● చెన్నై పోలీసు జాయింట్ కమిషనర్ ధర్మరాజన్

ప్యారీస్, మార్చి 9: నగరంలో చిన్నారుల కిడ్నాప్ జరగలేదని గ్రేటర్ చెన్నై పోలీస్ జాయింట్ కమిషనర్ ధర్మరాజన్ పేర్కొన్నారు. నుంగంబాక్కంలో చిన్నపిల్లలను గుర్తుతెలియని ముఠా కిడ్నాప్ చేస్తోందని పుట్టించిన వదంతులపై ధర్మరాజన్ శనివారం మీడియాకు వివరించారు. తమ ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడిని ఓ వ్యక్తి చేయి పట్టుకొని తనతో తీసుకెళ్లినట్లు ఆ ప్రాంతంలో ఉన్న చిన్నారులు అందజేసిన సమాచారంతో బాలుడి తల్లిదండ్రులు ఆ వ్యక్తిని బంధించి పోలీసులకు అప్పగించారు. బాలుడి కిడ్నాప్ ఫిర్యాదుపై తక్షణ చర్యలు చేపట్టి ఆరు బృందాలను విచారణకు ఏర్పాటు చేశామని, మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడి వెంట వెళ్లాడే కానీ, కిడ్నాప్ చేయలేదని విచారణలో తెలిసిందన్నారు.

## కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ వైద్య సేవలు



మొబైల్ అంబులెన్స్ వ్యానులో చికిత్స అందిస్తున్న సిబ్బంది

ప్యారీస్, మార్చి 9: రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవలపై కొటక్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ దృష్టి సారించింది. ఇందుకోసం మొబైల్ మెడికల్ వ్యానును అత్యాధునిక వసతులతో సిద్ధం చేసింది. ఆ సంస్థ ఎండీ మహేశ్ బాలసుబ్రమణి సీఎస్ఆర్ భాగంగా గురువారం నుంచి వైద్య సేవలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంగా మొబైల్ వైద్య సేవలను కుగ్రామాలకు కూడా విస్తరింపజేయనున్నట్టు ఆయన తెలిపారు.

## శ్మశానకొల్ల వేడుక



వేడుకల్లో పాల్గొన్న భక్తులు - వేషధారణతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వేలూరు, మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా కాట్పాడి సమీపం కలిన్‌జూర్‌లో శ్మశానకొల్ల శనివారం వైభవంగా జరిగాయి. అంకాళ పరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సి.నాయుడు బాబు, వేడుకల కమిటీ సభ్యులు ప్రతాప్, కుట్టి, కరాటే మాస్టర్ శక్తివేలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

## కేంద్ర నూతన విద్యావిధానం భేష్

● ఎస్కేడీటీ వార్షికోత్సవాల్లో ఆచార్య సీఎంకే రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థులు - బహుమతి గ్రహీతలతో ఆచార్య సీఎంకే రెడ్డి, జి.లలిత తదితరులు

ప్యారీస్, మార్చి 9 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యావిధానం విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే రీతిలో ఉందని ఆలిండియా తెలుగు ఫెడరేషన్ (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి అన్నారు. విల్లివాక్కంలోని ఎస్కేడీటీ ప్రాథమిక పాఠశాల 77వ వార్షికోత్సవాలు, క్రీడా దినోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలకు ఆచార్య సీఎంకే రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమిళనాడులో మైనార్టీ భాషల విద్యార్థులు వారివారి మాతృభాషల్లో చదువుకోవడం ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో సుప్రీంకోర్టు పరిష్కారం చూపిందన్నారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఏఐటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్, ప్రత్యేక ఆహ్వానితులుగా వీటీహెచ్ స్కూలు సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఎల్.నరసింహులు, ఆలిండియా రేడియో చెన్నై స్టేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లలిత పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభను చాటుకున్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రేణుక, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఎస్కేడీటీ మహోన్నత పాఠశాల అసిస్టెంట్ హెచ్‌ఎం మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

## అత్తాకోడళ్లు ఒకరికొకరు తినిపించుకుంటే భోజనం ఫ్రీ



తినిపించుకుంటున్న అత్తాకోడలు

పెరంబూర్, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పలు సంస్థలు వినూత్నంగా నిర్వహించాయి. ఆ క్రమంలో, కళ్లకుర్చిలోని ఓ హోటల్ ఈ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. అత్తాకోడలు ఒకరికొకరు తినిపించుకుంటే టిఫిన్, భోజనం ఉచితమని ప్రకటించింది. ఈ ఆఫర్ 12వ తేది వరకు ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. దీంతో పలువురు అత్తాకోడళ్లు హోటల్‌కు వెళ్లి ఒకరికొకరు తినిపించుకొనే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## 90 చోట్ల కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 9: తిరువళ్లూర్, దిండుగల్, వేలూరు సహా ఏడు జిల్లాల్లో 90 ప్రాంతాల్లో కార్చిచ్చు తలెత్తినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వేసవిలో అటవీప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. అడవుల్లో ఏర్పడే మంటలు ఆర్పేందుకు అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వేలూరు జిల్లాలో 41, దిండుగల్ జిల్లాలో కొడైకెనాల్ సహా 20 ప్రాంతాలు, సేలంలో 9, కృష్ణగిరి, తిరువణ్ణామలై జిల్లాలో తలా ఏడు, తిరువళ్లూర్‌లో 5, మదురైలో ఒక ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడింది. అటవీ శాఖ అధికారులు మంటలు ఆర్పడానికి చర్యలు చేపడుతున్నారు.

## విద్యుదాఘాతానికి 527 మంది మృతి

ఐసిఎఫ్, మార్చి 9: గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు విద్యుత్ ప్రమాదాల్లో 40మంది ఉద్యోగులు, 487మంది ప్రజలు మృతిచెందారు. 120 మంది విద్యుత్ ఉద్యోగులు, 160 మంది ప్రజలు ఈ ప్రమాదాల్లో గాయపడ్డారు. ఇవి మినహా 341 పశువులు ప్రాణాలు కోల్పోయాయని విద్యుత్ బోర్డు తెలిపింది.

## అయ్యనార్ విగ్రహం లభ్యం



ఐసిఎఫ్, మార్చి 9: కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో గుణమంగళంలో పల్లవుల కాలం నాటి అయ్యనార్ విగ్రహం బయల్పడింది. తిరువణ్ణామలై చరిత్ర పరిశోధకులు ఈ ప్రాంతంలో ఇటీవల పరిశోధనలు చేపట్టారు. అక్కడున్న చెరువు దగ్గర లభించిన విగ్రహాన్ని పరిశీలించారు. 4 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ విగ్రహం అయ్యనార్‌దని, పల్లవుల కాలానికి చెంది ఉంటుందని వెల్లడించారు. ఈ విగ్రహం 1,200 సంవత్సరాలుగా పూజలందుకుంటోంది.

## ప్రియుడితో కలసి విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 9: ప్రియుడితో కలసి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తిరుచ్చి జిల్లాకు చెందిన బాలిక(15) 10వ తరగతి చదువుతోంది. ఇటీవల ఇంటి నుంచి వెళ్లిన శ్రీనిధి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు... బంధువుల ఇళ్లు సహా పలు ప్రాంతాల్లో గాలించిన ఆమె జాడ తెలియక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, గ్రామ సమీ పంలోని చెట్టుకు ఓ యువతీయువకుడు ఉరేసుకున్నట్లు పోలీసులకు సమా చారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమను అంగీకరించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## గల్లంతైన జాలరి కుటుంబానికి ఆర్థికసాయం

ప్యారీస్, మార్చి 9: అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లి పడవ నుంచి జారపడి గల్లంతైన కన్నియాకుమారి జాలరి కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందిచనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. కులచ్చల్‌కు చెందిన యాసర్‌అలీ అనే జాలరి కొచ్చిన్ సమీపంలోని అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లి పడవ నుంచి జారిపడి గల్లంతయ్యాడు. దీనిపై ఆయన కుటుంబసభ్యుల విజ్ఞప్తి మేరకు మృతుడి కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిసాయం అందజేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

## దృష్టిని సంరక్షించే వబిస్మో యాంటీబాడీ ఆవిష్కరణ



వబిస్మో యాంటీబాడీని ఆవిష్కరిస్తున్న సిమ్సన్ ఇమ్మాన్యుయేల్

అడయార్, మార్చి 9: దేశంలోని ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో ఒకటైన రోచె... దృష్టిలోపాన్ని నివారించే వబిస్మో పేరుతో ఒక యాంటీబాడీని ఆవిష్కరించింది. దృష్టి లోపానికి గల రెండు ప్రధాన సమస్యలకు ఈ యాంటీబాడీ చెక్ పెడుతుందని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సింప్సన్ ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. రెటీనాలో ఉత్పన్నమయ్యే సమస్యలను నివారించి, దృష్టి లోపాన్ని అరికట్టడంతో ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కంటిశుక్లం, ఇతర నేత్ర లోపాలను సరి చేస్తుందన్నారు. దేశ నేత్ర వైద్య రంగంలో వబిస్మో ఒక ప్రధాన యాంటీబాడీగా మారుతుందన్నారు.

## పెరియార్ వర్శిటీ వీసీని డిస్మిస్ చేయాల్సిందే

● ఉద్యోగుల ధర్నా

అడయార్, మార్చి 9: సేలం జిల్లాలోని పెరియార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి జగన్నాథన్‌ను డిస్మిస్ చేయాలంటూ వర్శిటీ ఉద్యోగులు, సిబ్బంది ధర్నాకు దిగారు. వర్శిటీ ఉద్యోగ నియామకాల్లో అవినీతి అక్రమాలు జరిగాయనే ఫిర్యాదుల నేపథ్యంలో విద్యాశాఖ అదనపు కార్యదర్శి పళనిస్వామి, సహాయ కార్యదర్శి హెన్రీదాస్ సారథ్యంలోని కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణలో వర్శిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి తంగవేల్‌పై వచ్చిన ఎనిమిది ఆరోపణలు నిజమని తేల్చింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేయాలని వీసీని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కార్తీ ఆదేశించారు. కానీ, ఈ ఆదేశాలను ఉపకులపతి పట్టించుకోలేదు. పైగా, తంగవేల్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఇవ్వాలని కోరుతూ వీసీ జగన్నాథన్ ఏకంగా విద్యాశాఖ కార్యదర్శి కార్తీకి లేఖ రాశారు. ఆ తర్వాత తంగవేల్‌కు సంబంధించిన ఆధారాలను సమర్పించినప్పటికీ సస్పెండ్ చేయలేదు. ఇంతలో తంగవేల్ రిటైర్డ్ అయ్యారు. అయితే, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోని వీసీ వైఖరిని ఖండిస్తూ, వర్శిటీ ఉద్యోగులు, సిబ్బంది రిలే ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులోభాగంగా, శనివారం కూడా అనేక మంది ఉద్యోగులు యూనివర్శిటీ ప్రాంగణంలో ధర్నాకు దిగారు.

## గవర్నర్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు

● నాగర్‌కోయిల్‌లో కలకలం

అడయార్, మార్చి 9: కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అయ్య వైకుంఠనాథర్‌ను సనాతనవాదిగా ముద్రవేస్తూ గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లో పోస్టర్లు వెలిశాయి. వైకుంఠనాథర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన గవర్నర్ చర్యలను ఖండిస్తూ అయ్య వైకుంఠర్ వంశ రక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ పోస్టర్లు అంటించారు. ఈ పోస్టర్లు స్థానికంగా కలకలం సృష్టించగా, సోషల్‌మీడియాలోను వైరల్ అయ్యాయి. అంతేకాకుండా, అయ్య వైకుంఠర్‌ను సనాతనవాదిగా గవర్నర్ రవి పేర్కొనడాన్ని పలువురు రాజకీయ నేతలు కూడా ఖండించారు. ఈ పరిస్థితుల్లో నాగర్‌కోయిల్‌తో పాటు కుమరి జిల్లాలో ఈ పోస్టర్లు కలకలం సృష్టించాయి.



చెన్నైలోని కపాలేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి లింగోద్భవ దర్శనానంతరం ఆలయం వెలుపల మాజీ సీఎం, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

SUNDAY SPECIAL







# ఆరేళ్లలో చెన్నైకి కాలుష్య ముప్పు!

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆరేళ్లలో రాజధాని చెన్నై తీవ్ర కాలుష్య నగరంగా మారబోతోందా? వాయుకాలుష్యంలో దేశ రాజధాని ఢిల్లీతో పోటీ పడబోతోందా? ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరిశోధనలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమిస్తున్నాయి. ప్రస్తుతం చెన్నైలో వాయుకాలుష్యం కంటే అదనంగా మరో పావుశాతం వరకూ అధికమవటం ఖాయమని నివేదికలు చెబుతున్నాయి. చెన్నై, తూత్తుకుడి, మదురై, తిరుచ్చి నగరాల్లో జరిపిన ఈ పరిశోధనల్లో తూత్తుకుడి నగరం తక్కిన నగరాల కంటే అధికంగా వాయు కాలుష్యం బారిన పడుతోందని, అంతకంటే ముందు చెన్నై వాయు కాలుష్యంలో ఉన్నతస్థితికి చేరుతుందని ఆ పరిశోధనల ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ -సీస్టెప్ సంస్థ ఈ పరిశోధనలు నిర్వహించి చెన్నై నగరానికి కాలుష్య ముప్పు ముంచుకొస్తోందంటూ హెచ్చరించింది. ఉదాహరణకు గాలిలో ఉన్న విషకణాలు (టాక్సిక్ పార్టికల్స్)ను పార్టికల్ మేటర్ అని కూడా పిలుస్తారు. వీటి ఆకారాలు వేర్వేరుగా ఉంటాయి.



అందులో ముఖ్యమైనది 2.5 అనే ఆకారం గల కణాలు ముఖ్యమైనవి. 2030లో నగరంలో ఈ రకం విషకణాలు గాలిలో 27 శాతం దాకా పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయమై భూలోకపు స్నేహితుల బృందం సంస్థ నిర్వాహకుడు ప్రభాకరన్ మాట్లాడుతూ... విషకణాలు మూడు రకాలని, వాటిని పీఎం 1, పీఎం 2.5 పీఎం 10 అని పిలుస్తారని చెప్పారు. వీటిలో పీఎం 1 చాలా చిన్నదని, పీఎం 2.5 దానికంటే కాస్త పెద్దదని, పీఎం 2.5 కంటే చాలా పెద్దదే పీఎం 10 అని తెలిపారు. 1, 2.5, 10 అనే సంఖ్యలో ఒక్కో కణం యొక్క డయామీటర్‌ను తెలియజేస్తుందన్నారు. సాధారణంగా పర్యావరణ ప్రేమికులు పీఎం 2.5, పీఎం 10 కణాలు గురించే ఎక్కువగా ఆందోళన చెందుతుంటారని చెప్పారు. కారణమేమంటే ఈ రెండు పరిమాణాల్లో ఉన్న విషకణాల వల్ల మానవాళికి ముప్పు కలుగుతుందని, ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. తల వెంట్రుక సైజు కంటే 30 రెట్లు సన్నగా ఉండేవే పీఎం 2.5 విషకణాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పీఎం 2.5, పీఎం 10 విషకణాల వ్యాప్తిని బట్టి ఆ ప్రాంతాల్లోని కాలుష్య పరిస్థితులు తెలుసుకోగలుగుతారని చెప్పారు. ఈ పీఎం 2.5 విషకణాలు చదరపుమీటర్ విస్తీర్ణానికి 15 మైక్రోగ్రాములదాకా వ్యాప్తి చెంది ఉంటే ఆ ప్రాంతం సురక్షితమైనదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతుందన్నారు. అయితే చెన్నై నగరంలో ఈ పీఎం. 2.5 విషకణాలు చదరపు మీటర్‌కు 40 మైక్రోగ్రాముల దాకా వ్యాప్తి చెంది ఉండటం వల్లే భవిష్యత్తులో కాలుష్యం వల్ల నగరవాసులకు ముప్పు వాటిల్లడం ఖాయమని పరిశోధకులు చెబుతున్నారు. నగరంలో ఈ విషకణాల వ్యాప్తి ప్రాంతాలవారీగా వేర్వేరు పరిమాణాల్లో వ్యాప్తి చెంది ఉన్నాయి. ఈ విషకణాల వ్యాప్తిని పరిశీలిస్తే వచ్చే ఆరేళ్లలో పావు శాతం అధికమవుతుందని తెలుస్తోంది.

### ఉత్తర చెన్నైలో ఆయుఃక్షీణత...

2030లో నగరంలో గాలిలో పీఎం 2.5 విషకణాల వ్యాప్తి చదురపు మీటర్‌కు 50 మైక్రోగ్రాములు దాకా పెరుగుతుంది. 2019 నిర్వహించిన పరిశోధనలలో ఉత్తర చెన్నైలో వాయు కాలుష్యం అధికంగా ఉన్నట్టు నిర్ధారించారు. సుమారు 124 రోజులు ఉత్తర చెన్నైలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగినట్లు పరిశోధకులు గుర్తించారు. ఆ కారణంగా ఉత్తరచెన్నైలో ప్రజలకు ఆయుఃక్షీణత కూడా ఉండొచ్చని భావిస్తున్నారు. వాయుకాలుష్యం వల్ల ఇంచుమించు మనిషి ఆయుష్షులో 8 యేళ్లు తగ్గిందని కూడా రుజువైందన్నారు. నగరం చుట్టూ పెరుగుతున్న పరిశ్రమలు, నగరమంతటా పెరిగిన వాహనాల సంచారం, అడవుల నాశనం, ప్లాస్టిక్ వస్తువులు అధిక వినియోగం, నీటి వనరులను పరిరక్షించక పోవడమే వాయు కాలుష్యం అధికయడానికి కారణమని ప్రభాకరన్ తెలిపారు. ఈ దిశగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముమ్మర ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తే వాయు కాలుష్య ముప్పు నుండి నగరాన్ని కాపాడవచ్చునని ప్రభాకరన్ తెలిపారు.

## నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తీ 26వ చిత్రం



'కార్తీ-26' పూజా దృశ్యం

నలన్ కుమారస్వామి దర్శకత్వంలో హీరో కార్తీ నటిస్తున్నారు. కార్తీ నటించే 26వ చిత్రం. ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తన సొంత నిర్మాణ సంస్థ స్టూడియోగ్రీన్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ సంస్థకు ఇది 27వ చిత్రం కావడం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం శుక్రవారం చెన్నైలో జరిగింది. ఇందులో హీరో సూర్య పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'సూదు కవ్వుమ్', 'కాదలుం కడందు పోగుం' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన నలన్ కుమారస్వామి కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కొత్త తరహా కథనాలతో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించగల సత్తా ఉన్న నలన్ కుమారస్వామి తొలిసారి కార్తీని డైరెక్ట్ చేయనుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ సినిమాలో నటించే హీరోయిన్, ఇతర నటీనటులు, పనిచేసే టెక్నీషియన్ల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్టు నిర్మాత పేర్కొన్నారు. కాగా, కార్తీ తన 25వ చిత్రంగా 'జపాన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది.

## నడిగర్ సంఘానికి కమల్ రూ.కోటి విరాళం

నడిగర్ సంఘం భవన నిర్మాణ పనుల కోసం విశ్వనటుడు, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ తన వంతు సాయంగా కోటి రూపాయలను విరాళంగా అందించారు. ఈ చెక్కును శనివారం నడిగర్ సంఘం నిర్వాహకులకు అందజేశారు. ఆళ్వార్‌పేటలో ఉన్న తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నడిగర్ సంఘ ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్‌కు కమల్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌కు నడిగర్ సంఘం కార్యవర్గంతో పాటు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఇటీవల రాష్ట్ర మంత్రి, సినీ హీరో, నిర్మాత ఉదయనిధి కూడా నడిగర్ సంఘ భవన నిర్మాణం పనుల కోసం తన వ్యక్తిగత ఖాతా నుంచి కోటి రూపాయలను అందజేసిన విషయం తెల్సిందే. అదేవిధంగా మరికొందరు సినీ ప్రముఖులు ఈ భవన నిర్మాణానికి తమ వంతు సాయం చేసేందుకు ముందుకు రావాలని నడిగర్ సంఘం కోరింది.



నడిగర్ సంఘం నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న కమల్

## అనాగరిక సమాజంలో జీవిస్తున్నామా?

● సోనా హైడెన్



స్త్రీ అంటే ఏమిటో కూడా అవగాహన లేని చిన్నారిపై లైంగికదాడితో పాటు చిత్రహింసలకు గురిచేసి హత్య చేసే అనాగరిక సమాజంలో జీవిస్తున్నామా? అని సినీ నటి సోనా హైడెన్ ప్రశ్నిస్తున్నారు. పుదుచ్చేరిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసు యావత్ భారతాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. దీనిపై సోనా తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'నాగరిక సమాజంలో మృగాల వంటి మనుషులతో కలిసి మనం జీవిస్తున్నామని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉంది. నేను ఒక నటిని. నాతో పనిచేసే కో ఆర్టిస్టులకు కూడా ఇలాంటి అవమానకర చర్యలు ఎదురైనప్పటికీ వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నాం. ఇలాంటి జంతువుల నుంచి మమ్మల్ని మేం కాపాడుకునేందుకు పరుగెత్తుతూనే ఉన్నాం. ఈ పరుగు ఎన్నటికీ, ఎప్పటికీ అంతంకాని ప్రవాహం తరహాలోనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సమాజంలో మహిళలను చిత్రహింసలకు గురిచేయడం, వారిని చెడుగా చిత్రీకరించి చెడు ముద్ర వేయడం వంటి చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇలాంటి దురాగతాలపై ఇంకెంత కాలం మౌనంగా ఉండాలి. అందుకే ఇలాంటి దుశ్చర్యలకు వ్యతిరేకంగా మహిళా లోకం గొంతెత్తాలి' అని ఆమె పిలుపునిచ్చారు.

చిత్రజ్యోతి

## ఆస్పత్రి నుంచి హీరో అజిత్ డిశ్చార్జి

సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేరిన హీరో అజిత్ కుమార్ శనివారం ఉదయం డిశ్చార్జి అయ్యారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు అజిత్ వ్యక్తిగత మేనేజర్ సురేష్‌చంద్ర వెల్లడించారు. గురువారం ఆయన అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం చేరారు. ఆయనకు డాక్టర్లు నిర్వహించిన వైద్య పరీక్షల్లో చెవి వద్ద మెదడుకు వెళ్ళే నరంలో చిన్నపాటి వాపు వచ్చినట్టు గుర్తించగా, వెంటనే చికిత్స చేయాలని అజిత్ కోరడంతో వైద్యులు ఆ చికిత్సను పూర్తి చేశారు. దీనిపై అజిత్ మేనేజర్ సురేష్ చంద్ర స్పందిస్తూ, 'అజిత్‌కు బ్రెయిన్‌లో చిన్నపాటి గడ్డను గుర్తించినట్టు సాగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు. ఆయనకు ఆంజియో వంటి చికిత్స చేసి, శుక్రవారం సాయంత్రమే సాధారణ వార్డుకు మార్చారు. శనివారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు' అని పేర్కొన్నారు.





విజేతలకు బహుమతులు అందిస్తున్న చెఫ్ దాము, జీఆర్‌టీ హోటల్స్ సీజీఎం మన్‌దీప్‌జాస్

## జీఆర్‌టీ హోటల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పెరంబూర్, మార్చి 9: జీఆర్‌టీ హోటల్స్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 5, 7 తేదీల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన వంటల పోటీల్లో పలువురు మహిళలు పాల్గొన్నారు. నగరంలో జీఆర్‌టీ హోటల్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హోటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ మన్‌దీప్‌జాస్ అధ్యక్షత వహించగా, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ చెఫ్ దాము హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

## మోకాలి కీళ్ల మార్పిడి రోబోటిక్ సర్జరీలో అపోలో హాస్పిటల్స్ కొత్త రికార్డు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అపోలో హాస్పిటల్స్ మోకాలి కీళ్ల మార్పిడి రోబోటిక్ శస్త్రచికిత్సల్లో రికార్డు సృష్టించింది. రెండేళ్లలో నడవలేని స్థితిలో బాధపడుతున్న వెయ్యిమందికి శస్త్రచికిత్సలు నిర్వహించి త్వరితగతిన కోలుకునేలా చేసింది. ఈ వివరాలను నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స వైద్యనిపుణుడు అరుణ్ కన్నన్ తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు సులభతరమయ్యాయనే విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఆ దిశగానే ఈ చికిత్స చేసుకున్న రోగులతో సపోర్ట్ గ్రూపును ఏర్పాటు చేశామన్నారు. ఆ మాజీ రోగుల నోటిమాటల ప్రచారం వల్ల రోబోటిక్ సర్జరీపై ప్రజలలో భయం తొలగిపోతుందన్నారు. ఈ సభలో రోబోటిక్ శస్త్రచికిత్సలు చేసుకున్న సినీ నటుడు నిర్మాత పిరమిడ్ నటరాజన్, కార్తీక్ నటరాజన్, జ్ఞానం, రఘు, నటరాజన్ కన్నన్ సహా పలువురు తమ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ వైద్య సేవల సంచాలకులు (డీఎంఎస్) డాక్టర్ ఆర్కే వెంకటాచలం, రీజినల్ సీఈఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నటరాజన్ తదితరులతో ఆర్కే వెంకటాచలం, శివకుమార్, అరుణ్ కన్నన్

## రామేశ్వరంలో నేత్రపర్వంగా రథోత్సవం

ప్యారీస్, మార్చి 9: రామనాథ పురం జిల్లా రామేశ్వరంలో పురాతన రామనాథస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో మాసి మాఘ శివరాత్రి వేడుకలు ఈ నెల 1వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 8వ రోజైన శుక్రవారం రాత్రి 9 గంటలకు పర్వతవర్థిని సమేత రామనాథస్వామి ఉత్సవమూర్తులను వెండి వాహనంలో కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. శివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో తెల్లవార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం 7.30 గంటలకు సుందరంగా అలంకరించిన దైవదంపతుల ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి పశ్చిమ రాజగోపుర ప్రాంతం నుంచి హరోంహర దివ్యనాదాలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయం తరఫున, పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని రామేశ్వరం ప్రాంతంలోని ప్రధాన వీధుల్లో ఉదయం వాహనాల రాకపోకలు నిషేధించారు. 300 మందికి పైగా పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.



భక్తుల మధ్య కదులుతున్న రథం

## మేల్‌మలయనూరులో కోలాహలంగా శ్మశానకొల్ల



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

ప్యారీస్, మార్చి 9: విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరులో ప్రసిద్ధిచెందిన అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మాసి ఉత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజారోహణం, భక్తుల కంకణధారణతో ప్రారంభమయ్యాయి. రెండో రోజైన శనివారం ఉదయం నిర్వహించిన శ్మశానకొల్లకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. తెల్లవారుజామునే ఆలయ సన్నిధిని తెరచి గర్భగుడిలో ఉన్న అమ్మవారికి, శివపరమాత్ముడికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని బంగారు కవచంతో సుందరంగా అలంకరించారు. అమ్మవారు కాళీ మాత అలంకారంలో ఉదయం 10 గంటలకు మేల్‌మలయనూరు సరిహద్దుల నుంచి భక్తుల దివ్యనామస్మరణ, మేళతాళాల మధ్య విహారానికి బయల్దేరారు. ఉదయం 10.45 గంటలకు అమ్మవారికి దీపారాధన అనంతరం కళాకారుల బృందాలు కోలాటం, మైలాట్టం, గరగాట్టంతో ఊరేగింపులో పాల్గొని సందడి చేశాయి. మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మ కపాలం పేరుతో అమ్మవారి ముందు ఆలయ పూజారులు ఆడుతూ పాడుతూ సమీపంలో ఉన్న శ్మశానానికి తరలివెళ్లారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారికి గుగ్గిళ్లు, నవధాన్యాలు, కూరగాయలు, పండ్లు, చిల్లర నాణేలను నివేదించి తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. శ్మశానకొల్ల సందర్భంగా మేల్‌మలయనూరులో వీధి వీధినా అంకాళ పరమేశ్వరి, శివపార్వతులు, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, ఆదిపరాశక్తి, దుర్గాదేవి, వినాయకుడు తదితర కటౌట్లు విద్యుద్దీపాలంకరణలో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

## జేహెచ్ రిహాబిలిటేషన్ హాస్పిటల్ ప్రారంభం

పెరంబూర్, మార్చి 9: స్థానిక మొగప్పేర్ ఈస్ట్‌లో జేహెచ్ రిహాబిలిటేషన్ హాస్పిటల్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ నటుడు సత్యరాజ్, సీనియర్ పాత్రికేయుడు నక్కీరన్ గోపాల్, జేహెచ్ రిహాబిలిటేషన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జ్ఞాషియస్ జాకబ్ పాల్గొని, ఆసుపత్రి సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జాకబ్ మాట్లాడుతూ... నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. గుండెనొప్పి, క్యాన్సర్ సహా ఇతర ప్రమాదకర వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించడంతో పాటు వారు మానసిక ఒత్తిడి అధికమించేలా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. దేశవ్యాప్తంగా వైద్యసేవలందిస్తున్న తమ సంస్థ చెన్నైలో ఆసుపత్రి ప్రారంభించడం శుభపరిణామమని పలువురు వక్తలు పేర్కొన్నారు.



ప్రారంభోత్సవంలో సత్యరాజ్, నక్కీరన్ గోపాల్, డాక్టర్ జాకబ్ తదితరులు